సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 29 । నవంబర్ । 2023




## దాతలే దేవుళ్లు

అంతుచిక్కని వ్యాధితో ఓ యువతి బాధ పడుతోంది. చికిత్స తల్లిదండ్రుల స్థాయికి భారమవుతోంది. - 8లో



## పోలీసుల కార్డన్ సెర్చ్

శ్రీకాకుళంలో పోలీసులు కార్డన్ సెర్చ్ చేశారు. పలు వీధుల్లో తనిఖీలు నిర్వహించారు. - 8లో

## బీటెక్ ఆరో సెమిస్టర్, డిగ్రీ సప్లిమెంటరీ రెండో సెమిస్టర్ ఫలితాలు వెల్లడి

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో పరిధిలో బీటెక్ ఆరో సెమిస్టర్, డిగ్రీ రెండో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలను వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు మంగళవారం విడుదల చేశారు. ఫలితాలను జ్ఞాన భూమి వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వీసీ తెలిపారు. ఈ పరీక్షలు ఆగస్టు నెలలో నిర్వహించామన్నారు.

## న్యూస్‌రీల్

### సబ్జెక్టు అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో ప్రారంభించిన నాలుగేళ్ల సమీకృత ఉపాధ్యాయ విద్య డిగ్రీ కోర్సు కోసం సబ్జెక్టు అధ్యాపకులను నియమించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ తెలిపారు. విశ్వవిద్యాలయంలో మంగళవారం రిజిస్ట్రార్ వివరాలు వెల్లడించారు. గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, అర్థశాస్త్రం, చరిత్ర, రాజనీతి శాస్త్రం, తెలుగు సబ్జెక్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఏడాది కాల వ్యవధి సబ్జెక్టు కాంట్రాక్టు విధానంలో నియామకం ఉంటుందని అన్నారు. దరఖాస్తు చేసుకునే వారికి పీజీ, బీఎడ్‌లో కనీసం 55 శాతం మార్కులు ఉండాలని చెప్పారు. మార్కుల అర్హతతో పాటు డాక్టరేట్, నెట్, స్లెట్ వంటి ఒక అర్హత ఉండాలని తెలిపారు. డిసెంబర్ 8వ తేదీలోపు రిజిస్ట్రార్ కార్యాలయానికి నేరుగా, రిజిస్ట్రార్ పోస్టు ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

### 1న ఎయిడ్స్ డే ర్యాలీ

అరసవల్లి: ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా డిసెంబర్ 1న జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్నామని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి తెలియజేశారు. ఈ నెల 2 నుంచి వచ్చే నెల 1 వరకు ఎయిడ్స్ డే సందర్భంగా పలు కార్యక్రమాలను చేపడుతున్నామని వివరించారు. ఎయిడ్స్ నియంత్రణ మన చేతుల్లోనే ఉందనే విషయాన్ని తెలియజేసేలా ర్యాలీ ఉంటుందని, ఈ మేరకు అవగాహన కోసం స్థానిక బాపూజీ కళామందిర్‌లో సమావేశాన్ని నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా న్యూట్రిషన్ ఫుడ్‌తో పాటు దుస్తులను పంపిణీ చేయనున్నామని ప్రకటించారు.

### ప్రతిభకు వేదిక 'ఆడుదాం ఆంధ్రా'



ఎంవీ స్వరూప్

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలోనే అతి పెద్ద క్రీడా టోర్నమెంట్‌గా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆడుదాం ఆంధ్రా పోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మెంటాడ వెంకట స్వరూప్ పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం శ్రీకాకుళం మండలవీధిలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మారుమూల గ్రామాలు, పట్టణాలు, నగరాల్లోని క్రీడాకారుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రతి దశలోనూ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయడంతో పాటు వారికి సర్టిఫికెట్లు, భారీగా నగదు ప్రోత్సాహకాలు అందజేయడం జరుగుతుందని చెప్పారు. క్రీడా చరిత్రలోనే ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో 15 ఏళ్ల వయసు పైబడిన వారందరూ ఈ పోటీల్లో భాగస్వాములయ్యేలా ఓపెన్ మీట్ నిర్వహించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన చేశారన్నారు.

**ఐదు క్రీడాంశాల్లో..**

తొలుత ఈ పోటీలను క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ (డబుల్స్)లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆడుదాం-ఆంధ్ర క్రీడా పోటీల రిజిస్ట్రేషన్ ఇప్పటికే ప్రారంభమైందని, యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. డిసెంబరు 13 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. 15ఏళ్లకు పైబడిన బాలబాలికలు సమీపంలోని సచివాలయాల్లో, వలంటీర్ల ద్వారా, ఆన్‌లైన్‌లో ఆడుదాంఆంధ్రా.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌పోర్టల్‌లో, 1902కి ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకోవచ్చునని ఎంవీ స్వరూప్ సూచించారు.

### డిసెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ లోక్ అదాలత్‌ను డిసెంబర్ 9న నిర్వహించనున్నట్లు జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఆయన మంగళవారం జిల్లా కోర్టులోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఫిజికల్, వర్చువల్‌గా ఇన్సూరెన్స్ కంపెనీలు, మోటార్ ప్రమాద కేసులోని పిటీషనర్ అడ్వకేట్లు, ఇన్సూరెన్స్ కంపెనీ స్టాండింగ్ కౌన్సిల్ బ్యాంకు ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయడానికి అందరూ కృషి చేయాలని కోరారు. ఇక్కడ మోటార్ ప్రమాద కేసులు రాజీ చేసుకోవడం వల్ల కక్షిదారులకు సత్వరమే పరిష్కారం దొరుకుతుందన్నారు. ఇన్సూరెన్స్ కంపెనీలకు కూడా కోర్టు ఖర్చులు, వడ్డీ తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. సమావేశంలో జిల్లాలోని మొదటి అదనపు జిల్లా జడ్జి కె.శ్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు

వాయువు ఆయువు పెంచుతోంది. మలినం లేని గాలి మనుషుల ఆరోగ్యాన్ని కాపాడుతోంది. శ్రీకాకుళం కాలుష్య కోరల నుంచి బయట పడుతోంది. స్వచ్ఛ శ్రీకాకుళం వైపుగా పయనం దిగ్విజయంగా సాగుతోంది. కొత్తగా ఏర్పాటైన రహదారులు, రోడ్లపై కనిపిస్తున్న ఊడ్చే యంత్రాలు, నీటిని చిమ్మే స్ప్రింక్లర్లు, ఇంటింటికీ వచ్చే చెత్త వాహనాలు, ఎక్కడికక్కడ కనిపిస్తున్న పచ్చటి మొక్కలు.. గాలిలో కాలుష్య కారకాలను తగ్గిస్తున్నాయి. ఈ ప్రయత్నం ఇలాగే కొనసాగిస్తే అనతి కాలంలోనే స్వచ్ఛ శ్రీకాకుళంతో పాటు స్వాస్థ్య శ్రీకాకుళ స్వప్నం కూడా నెరవేరుతుంది.

# స్వచ్ఛత మెరుగు ఆయువు పెరుగు..





శ్రీకాకుళం నగరంలో రోడ్లను క్లీన్ చేస్తున్న మెకానికల్ స్వీపింగ్ మిషన్

- శ్రీకాకుళంలో తగ్గుముఖం పడుతున్న వాయు కాలుష్యం
- కాలుష్య నియంత్రణలో సత్ఫలితాలు
- రాష్ట్రంలో నాలుగు నగరాల్లో తగ్గిన కాలుష్యం
- అందులో ఒకటిగా నిలిచిన శ్రీకాకుళం నగరం
- రూ. 3కోట్లతో ప్రత్యేక పనులు
- కోట్లాది రూపాయలతో పార్కుల అభివృద్ధి, చెత్త ఏరివేత ప్రక్రియ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: శ్రీకాకుళం స్వచ్ఛంగా మారుతోంది. కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు మంచి ఫలితాలు అందిస్తుండడంతో వాయు కాలుష్యం తగ్గుముఖం పడుతోంది. తాజాగా రాష్ట్రంలో వాయు కాలుష్యం తగ్గిన నాలుగు నగరాల్లో శ్రీకాకుళం ఒకటిగా నిలిచింది. గత ఏడాది పీఎం(పర్టిక్యులేట్ మేటర్) 10 లెవెల్స్ 76 ఉండగా, నాలుగు నెలల కిందట 72కి తగ్గింది. ఇది ఇంకా తగ్గే అవకాశం ఉందని అంటున్నారు. సాధారణంగా పీఎం 10 లెవెల్స్ 60లోపు ఉంటే కాలుష్యం అదుపులో ఉన్నట్టు లెక్క. శ్రీకాకుళంలో 76కు పైగా దాటిపోయింది. ప్రస్తుతం కాస్త తగ్గినా దాన్ని ఇంకా తగ్గించేందుకు అధికార యంత్రాంగం కృషి చేస్తోంది.

**నిరంతర కృషి..**

శ్రీకాకుళం నగరంలో ప్రస్తుతం కార్పొరేషన్ కార్యాలయం పైన, గుజరాతీపేట జిల్లా సహకార అధికారి కార్యాలయం వద్ద, కుశాలపురం వద్ద కాలుష్య మానిటరింగ్ స్టేషన్లు ఉన్నాయి. వాటి ఫలితాల ద్వారా శ్రీకాకుళం నగరంలో ఉన్న వాయు కాలుష్యం ఎప్పటికప్పుడు తెలుస్తోంది. ఏటా పెరుగుతున్న ఇండెక్స్‌ను విశ్లేషణ చేసిన ప్రస్తుత ప్రభుత్వం వాయు కాలుష్యం నియంత్రణపై దృష్టి సారించింది. దానిలో భాగంగా తొలుత అధ్వానంగా ఉన్న రహదారుల కారణంగా దుమ్ము ధూళి ఎక్కువవుతోందని గుర్తించింది. మార్కెట్‌లో దుమ్ము ధూళితో కూడిన రోడ్లు, ఏడు రోడ్ల జంక్షన్ నుంచి పీఎస్ఎన్ షా మిల్లు జంక్షన్ వరకు ఉన్న రోడ్డు, పొట్టి శ్రీరాములు జంక్షన్ నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే రోడ్డు, కొత్త బ్రిడ్జి నుంచి బైపాస్‌కు వెళ్లే కిమ్స్ రోడ్డు, పాత బ్రిడ్జి నుంచి బైపాస్ జంక్షన్ వరకు ఉన్న పాలిటెక్నిక్ కాలేజ్ రోడ్డును అభివృద్ధి చేసింది. రూ.2.24కోట్లతో వీటి పునర్నిర్మాణ పనులు చేపట్టింది. దీంతో ఆ రోడ్లలో కొంతమేర వాయు కాలుష్యం తగ్గింది. అంతేకాకుండా మరో రూ.73లక్షలతో పూడికలు తీసేందుకు మినీ ఎక్స్‌వేటర్, రోడ్లపై ఉన్న ధూళి ఎగరకుండా ఉండేలా తడిపేందుకు స్ప్రింకర్లతో కూడిన వాటర్ ట్యాంక్‌ను, రోడ్లపై ఉన్న దుమ్ము ధూళిని తొలగించే మెకానికల్ స్వీపర్‌ను కొనుగోలు చేసి వినియోగంలోకి తెచ్చారు. డే అండ్ నైట్ జంక్షన్ వద్ద వాటర్ ఫౌంటెయిన్‌ను ఏర్పాటు చేశారు. ఇవన్నీ వినియోగించడంతో పాటు తడి పొడి చెత్తలను వేరు చేయడం, ఆరు బయట ఎక్కడికక్కడ చెత్త కుప్పలు లేకుండా చేయడం, మొక్కలు నాటడం, కోట్లాది రూపాయలతో పార్కులు అభివృద్ధి చేయడంతో మంచి ఫలితాలు వచ్చాయి.

### మరిన్ని చర్యలతో ముందుకు...

నగరంలో వాయు కాలుష్యం తగ్గుముఖం పడుతోంది. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ఒకప్పటి కంటే కాలుష్యం లెవెల్స్ తగ్గాయి. భవిష్యత్‌లో మరింత తగ్గే అవకాశం ఉంది. ఇప్పటికే కాలుష్య నియంత్రణ కోసం ప్రత్యేకంగా రూ. 3కోట్లు వెచ్చించగా, పార్కుల అభివృద్ధి, తడిపొడి చెత్త వేరు చేసే ప్రక్రియ తదితర వాటికి కోట్లాది రూపాయలు ఖర్చు చేశాం. కాలుష్యం మానిటరింగ్ స్టేషన్‌లలో ప్రస్తుతం మాన్యువల్‌గా రీడింగ్ తీస్తుండగా, భవిష్యత్‌లో కంప్యూటర్ రీడింగ్ మానిటరింగ్ మిషన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నాం. మరింత కచ్చితత్వంతో కాలుష్యంపై అంచనా వేసి, పరిస్థితిని అదుపులోకి తీసుకువస్తాం. - ఓబులేసు, కమిషనర్, శ్రీకాకుళం నగర పాలక సంస్థ



హైట్రాఫిక్ రోడ్డుపై దమ్ము ధూళి ఎగరకుండా వాటర్ స్ప్రింక్లింగ్ చేస్తున్న ట్యాంకర్

### నాలుగు జిల్లాల్లో..

రాష్ట్రం ప్రభుత్వం తీసుకున్న చర్యలతో నాలుగు జిల్లా కేంద్రాల్లో వాయు కాలుష్యం తగ్గుముఖం పట్టింది. అందులో మన శ్రీకాకుళం నగరం ఉంది. నాలుగు నెలల కిందట పీఎం 10 లెవెల్స్ 76 ఉండగా ఇప్పుడు 72కి తగ్గింది. ఇప్పుడది మరింత తగ్గనుంది. ఇంతటితో ఆగకుండా నగరంలో అవసరం మేరకు మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. వాయు కాలుష్యానికి కారణమని భావిస్తున్న పలు ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పించి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా నాగావళి నది నుంచి ఎడ్ల బండ్ల ద్వారా ఇసుకను తీసుకొస్తున్నప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఎక్కడికక్కడ ఇసుక ఎగిరిపడుతోంది. ఈ పరిస్థితి లేకుండా చర్యలు తీసుకుంటోంది. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఫ్రీ ఫ్లో ఉండేలా చూస్తోంది. కాలం చెల్లిన వాహనాలను సీజ్ చేసేలా, వ్యవసాయ వ్యర్థ పదార్థాలను కాల్చకుండా, వంట చెరకు బదులు గ్యాస్ వినియోగం తెచ్చేలా, పెట్రోల్, డీజిల్ వాహనాలకు బదులు ఎలక్ట్రికల్ వాహనాలు వినియోగంలోకి తెచ్చేలా ఆయా శాఖల సమన్వయంతో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇవన్నీ పూర్తి స్థాయిలో అమలయితే పరిస్థితి అదుపులోకి వస్తుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.



డే అండ్ నైట్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెయిన్



పొట్టి శ్రీరాముల మార్కెట్‌లో నాడు నేడు రోడ్ల పరిస్థితి



అభివృద్ధి చేసిన రోడ్డు (నాడు-నేడు)



కాలుష్య నియంత్రణలో భాగంగా రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు

## జిల్లా నూతన ఈఎస్‌గా సుబ్బారావు



బి.సుబ్బారావు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా నూతన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్), ఎచ్చెర్ల బాట్లింగ్ కంపెనీ యూనిట్ (ఏపీఎస్‌బీసీఎల్) డిపో మేనేజర్‌గా బి.సుబ్బారావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు పనిచేసిన వై.ఆదినారాయణమూర్తి ఈనెల 24న సస్పెన్షన్‌కు గురైన సంగతి విధితమే. ఈయన స్థానంలో పల్నాడు జిల్లా నర్సారావుపేటలో ఈఎస్ గా పనిచేసిన సుబ్బా రావు బదిలీపై ఇక్కడికి వచ్చారు. స్వ గ్రామం గుంటూరు జిల్లా నర్సారా వుపేట కాగా ఈయన 2012 గ్రూప్-1 బ్యాచ్‌కు చెందిన వారు.

## 'కచ్చితమైన ఓటరు జాబితా తయారు చేస్తాం'



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న శ్యామలరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, ఓటర్ల జాబితా పరిశీలకులు జె.శ్యామలరావు అన్నారు. ఆయన మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్ రోజు నుంచి ఇప్పటివరకు ఓటర్ల జాబితా సవరణలో తీసుకున్న చర్యలను వివరించారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన పలు సమస్యలను నమోదు చేసుకుని, లిఖిత పూర్వకంగా సమర్పించిన వినతులను తీసుకున్నారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు లోబడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని, అత్యంత పారదర్శకంగా జాబితాలను తయారు చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల సమన్వయంతో నమోదు ప్రక్రియ జరుగుతోందని, ప్రతి వారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నియోజకవర్గ స్థాయిలోనూ, జిల్లా స్థాయిలోనూ సమావేశాలు నిర్వహించి వారి సూచనలు సలహాలు పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు శంకర రావు జాబితాపై తమకు ఎలాంటి అభ్యంతరాలు లేవని, పూర్తి సంతృప్తిని వ్యక్తం చేశారు. టీడీపీ ప్రతినిధి కూన రవికుమార్, బీజేపీ ప్రతినిధులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, చల్లా వెంకటేశ్వరరావులు, సీపీఎం ప్రతినిధి డి.గోవింద రావు, కాంగ్రెస్ ప్రతినిధి గోవింద మల్లిబాబు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, మాజీ ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, కలమట వెంకటరమణ, గుండ లక్ష్మీదేవి తదితరులు తమ తమ నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాలో సమస్యలను తెలిపారు.

## దొంగే దొంగా.. దొంగా.. అన్నట్టుంది!

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఓటర్ల జాబితా సవరణలో అవకతవకలు జరిగాయంటూ టీడీపీ నేతలు గగ్గోలు పెడుతుంటే దొంగే దొంగా.. దొంగా..! అన్నట్లు ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణ దాస్ జిల్లా టీడీపీ నేతలపై ఫైర్ అయ్యారు. వ్యవస్థలను మేనేజ్ చేయడం, ఓటర్ల జాబితాలను తారుమారు చేయడం టీడీపీకి అలవాటని మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన విమర్శించారు. 'సేవా మిత్ర'యాప్ ఉపయోగించి 2017లో ఆ పార్టీ ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి, లక్షల మంది ఓట్లను తొలగించి, పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిందని, దానిపై ఎఫ్ఐఆర్ నమోదు కూడా చేశారనే విషయాన్ని గుర్తు చేశారు. తాజాగా ఆ పార్టీయే మరోసారి ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తూ, మొబైల్‌కు వచ్చే ఓటీపీలను సైతం అడుగుతున్నారని, ఇవ్వకపోతే దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని అన్నారు. బోగస్ ఓట్లు, దొంగ ఓట్ల సంస్కృతి టీడీపీ వారిదేనని, ప్రజాస్వామ్యబద్ధంగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలన్నదే తమ అభిమతమని, ఆ దిశగా కృషి చేస్తున్న ఎన్నికల యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలియజేసున్నట్లు పేర్కొన్నారు. అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడులు కూడా గట్టెక్కింది దొంగ ఓట్లతోనే కదా అని ఆరోపించారు.

## 'మాదక ద్రవ్యాలను నియంత్రించాలి'



వర్చువల్ విధానం ద్వారా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ జీఆర్ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు సమన్వయంతో పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ జీఆర్ రాధిక అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం వర్చువల్ విధానంలో జరిగిన జిల్లాస్థాయి కమిటీ సమన్వయ (నార్కో కోఆర్డినేషన్) సమావేశంలో కమిటీ చైర్మన్‌గా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, కన్వీనరుగా ఎస్పీ రాధిక, సభ్యులుగా ఎన్‌ఫోర్సుమెంట్ సూపరింటిండెంట్, సబ్‌కలెక్టర్, ఆర్డీఓలు, డీఈఓ, డీఎంహెచ్ఓ, జిల్లావ్యవసాయాధికారి పాల్గొన్నారు. ముందుగా గత నెలలో జరిగిన జిల్లాస్థాయి సమన్వయ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, అమలు, నియంత్రణ చర్యలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అవగాహన లేకపోవడంతోనే మాదక ద్రవ్యాలకు యువత ఎక్కువగా ఆకర్షితులవుతున్నారని తెలిపారు. వీటి వల్ల కలిగే దుష్ప్రభావాలపై అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. విద్యాసంస్థల్లో చేపట్టిన అవగాహన కార్యక్రమాలు, వివరాలు, సమాచారాన్ని ఫొటోలతో కూడిన పీపీటీని జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

ఎస్పీ రాధిక మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం నియంత్రణ చర్యల్లో భాగంగా లాడ్జీలు, హోటళ్లలో బస చేసే కొత్త వ్యక్తుల వివరాలు నమోదు కోసం లాడ్జ్ విజిటర్ మానిటరింగ్ సిస్టమ్ అనే నూతన యాప్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ యాప్ ద్వారా కొత్త వ్యక్తులపై నిఘా ఉంచామని చెప్పారు. జిల్లా సరిహద్దు కేంద్రాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, గత నెలలో ఇచ్ఛాపురం పరిధిలో గంజాయి తరలిస్తున్న ఒక లారీని స్పెషల్‌ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో (సెబ్) సిబ్బంది పట్టుకున్నారని తెలిపారు. జిల్లా పోలీసు యంత్రాంగం, సెబ్ విభాగాలు సమన్వయంతో 21 కేంద్రాల్లో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సెబ్ జేడీ విజయనాగమణికంఠ, అడిషనల్ ఎస్పీ విఠలేశ్వరరావు, డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐలు శ్రీనివాస్, ఎస్.రామకృష్ణ, శ్రీనివాసరావు, కేంద్ర ఇంటిలిజెన్సు బ్యూరో అధికారి పీకే మహంతో పాత్రో, సెబ్ అధికారులు వర్చువల్ ద్వారా ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## కొత్తూరులో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు భూమిపూజ



శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు: ప్రజలకు నాణ్యమైన విద్యుత్ నిరాటంకంగా సరఫరా చేయడమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యమని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. కొత్తూరులో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.46 కోట్లతో నూతనంగా మంజూరు చేసిన 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ఆమె మంగళవారం భూమి పూజ చేశారు. ముందుగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో 28 విద్యుత్ సబ్ స్టేషన్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తూరులో ఏర్పాటు చేసిన ప్రారంభ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ వినియోగం పెరుగుతున్నందున అందుకు అనుగుణంగా కొత్తూరులో 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ సబ్ స్టేషన్ వల్ల రైతులకు తొమ్మిది గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. లో ఓల్టేజీ సమస్యలు కూడా తగ్గుతాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల కొత్తూరు, భామిని, హిరమండలం, సీతంపేట మండలాలకు చెందిన సుమారు 2.50 లక్షల విద్యుత్ వినియోగదారులు ప్రయోజనం పొందుతారని పేర్కొన్నారు. గత పాలకులు ఈ సమస్యను పట్టించుకోలేదని గుర్తు చేశారు. కార్యక్రమంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, కొత్తూరు సర్పంచ్ పడాల కృష్ణవేణి, ట్రాన్స్‌కో ఎస్ఈ రమణ, ఈఈ సురేందర్‌బాబు, డీఈఈ శ్రీనివాసరావు, ఏపీడీసీఎల్ ఎస్ఐ ఎస్. కృష్ణమూర్తి, ఈఈ శంకరరావు, డీఈఈ ప్రసాదరావు, కొత్తూరు ఏఈ లక్షణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కామక భాగ్యవతి, ఎల్ఎన్‌పేట రెడ్డి జ్యోతిలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ పాల్గొన్నారు.




### దళారులు లేకుండా సంక్షేమం..



దళారులు లేకుండా ఈ ప్రభుత్వం సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందజేస్తోంది. ఇది వరకు కుల ధ్రువీకరణ పత్రం కావాలంటే నానా ఇబ్బందులు పడేవాళ్లం. కానీ జగనన్న సురక్ష కార్యక్రమంలో నాకు ఒక గంట వ్యవధిలోనే పత్రం ఇచ్చారు. ఇలా చాలా రకాల కార్యక్రమాలు మధ్యవర్తులు లేకుండానే జరుగుతున్నాయి. ఇది మంచి పరిణామం. - పేడాడ శ్రీరామమూర్తి, దవళపేట, జి.సిగడాం మండలం

### పెద్ద కొడుకుతో సమానం..



నా భర్త మృతి చెందాడు. ఇద్దరు పిల్లలకూ వివాహం జరిగింది. వారు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు. సీఎం జగన్ వచ్చాక ఇల్లు మంజూరు చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీనే రూ.2750 పింఛన్ అందిస్తున్నారు. నెలకు సరిపడా మందులు మా గ్రామంలోనే అందిస్తున్నారు. జగన్‌బాబు పెద్దకొడుకుతో సమానం.

- గడే పోలిపల్లి, ఆనందపురం, జి.సిగడాం మండలం

## క్లుప్తంగా

### పొందూరులో పిచ్చికుక్క స్వైర విహారం


చికిత్స పొందుతున్న బాధితుడు

**పొందూరు:** పొందూరులో మంగళవారం సాయంత్రం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. కనిపించిన వారిపై దాడి చేసి కరిచింది. దాదాపు 20 మందికిపైగా గాయాలపాలయ్యారు. అంబేడ్కర్ సెంటర్ నుంచి వాంగ్రంగి జంక్షన్, స్టేట్ బ్యాంకు, కేవీఆర్ థియేటర్, ఆఫీషియల్ కాలనీలో 20 మందిని గాయపరిచింది. ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఓ ఉద్యోగిని కరిచి అక్కడి నుంచి బస్టాండ్‌కు వెళ్లి మరికొంత మందిని కరిచింది. వీరంతా ప్రైవేటు ఆస్పత్రుల్లోను, ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందారు. పిచ్చికుక్కను వెంబడించి హతమార్చారు.

### వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక


వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

**మందస:** కొంకడాపుట్టి సచివాలయం పరిధిలో పలువురు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సచివాలయం కన్వీనర్ నాగేశ్వర జయరాం ఆధ్వర్యంలో వీరంతా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి మంత్రి అప్పలరాజు పార్టీ కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో కొమ్మన్న బుజ్జి, ఇప్పిలి వెంకటేష్, జారు కిషోర్, శ్రీకాంత్, జారు చంద్రశేఖర్, బాడన్న, కిషోర్, కె.చందు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అగ్గన్న సూర్యారావు కూడా ఉన్నారు.

### 24 గంటల్లో లారీ పట్టివేత

**టెక్కలి రూరల్:** మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టుకు ముడిసరుకు రవాణా చేసే లారీ చోరీకి గురైన విషయం తెలిసిందే. అయితే లారీ యజమాని శిల్పశెట్టి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టెక్కలి ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి 24 గంటల్లోనే బండి ఆచూకీ కనిపెట్టారు. కోటబొమ్మాళి మండలం లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన సిమ్మ రాంబాబు అనే వ్యక్తి లారీని దొంగలించినట్లు గుర్తించి తన గ్రామ సమీపంలోనే లారీతో పాటు ముద్దాయిని అదుపులో తీసుకున్నట్లు టెక్కలి ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

### అడవి జంతువు దాడిలో ఆవు దూడ మృతి


స్థానిక రైతులతో మాట్లాడుతున్న అటవీ శాఖ సిబ్బంది

**సోంపేట:** మామిడి పల్లి పంచాయతీ చిన మామిడిపల్లి గ్రామానికి చెందిన తోట నారాయణరావు ఆవు దూడపై సోమవారం రాత్రి గుర్తుతెలియని అడవి జంతువు దాడి చేయడంతో దూడ మృతి చెందింది. దీంతో అటవీ శాఖ సిబ్బంది రాజేంద్ర, సంతోష్ సంఘటన స్థలానికి వచ్చి రైతులతో మాట్లాడారు. అడవి జంతువుల బారి నుంచి రక్షణ కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

### బోధకులకు పరిపాలన బాధ్యతలు

**ఎచ్చెర్ల క్యాంపస్:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో బోధన సిబ్బందికి పాలన బాధ్యతలు అప్పగిస్తూ వైస్ చాన్సలర్ ప్రొఫసర్ నిమ్మ వెంకటరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీడీసీ అసిస్టెంట్ డీన్‌గా హెచ్.సుబ్రహ్మణ్యం, స్పోర్ట్స్ అసిస్టెంట్ డీన్‌గా రమణమూర్తి, అకడమిక్ అఫైర్ అసిస్టెంట్ డీన్‌గా గోవిందరాజు, ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్‌గా పి.రామకృష్ణ, ఆర్ట్స్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాళ్లుగా రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాస్, సైన్స్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్‌గా పద్మారావు, కల్చరల్ కోఆర్డినేటర్‌గా ఉదయ్‌కిరణ్, పూర్వపు విద్యార్థుల కోఆర్డినేటర్‌గా రవికుమార్, ఐక్యూ ఏసీ సభ్యులుగా తిరుపతిరావు, రామకృష్ణ, విజయ్‌కుమార్‌తో పలు పలువురు బాధ్యతలు స్వీకరించారు. వీరు వీసీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



# దాతలే దేవుళ్లు

- అంతుచిక్కని వ్యాధితో బాధపడుతున్న నర్సింగ్ విద్యార్థి
- నానాటికీ క్షీణిస్తున్న ఆరోగ్యం
- చికిత్స కోసం దాతల సాయం కోరుతున్న తల్లిదండ్రులు

**జి.సిగడాం:** ఆమె చక్కగా చదువుకుంది. చదువయ్యాక ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఉద్యోగంలో కూడా చేరింది. చక్కగా విధులు నిర్వహించుకుంటూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండేది. ఏమైందో ఏమో తెలీదు ఐదు నెలల కిందట ఒక రోజు ఉన్నట్టుండి స్పృహ కోల్పోయింది. అంతే అప్పటి నుంచి తెల్ల రక్తకణాలు తగ్గిపోవడం, జ్వరం, డయేరియా, కడుపు నొప్పి తీవ్రం కావడం మొదలుపెట్టాయి. నాలుగు నెలల వ్యవధిలో ఆ యువతి 15 కిలోల బరువు తగ్గిపోయి క్షీణించిపోయింది. అంతుచిక్కని ఈ వ్యాధిపై పోరాడడం ఆ యువతి తల్లిదండ్రులకు తలకు మించిన భారమవుతోంది. అందుకే వారు దాతల సాయం కోరుతున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే..

మండల పరిధిలోని సంతవురిటి గ్రామానికి చెందిన కడగాన ప్రవల్లిక (28) అంతు చిక్కని వ్యాధితో బాధ పడుతోంది. ఆమె తల్లిదండ్రులు సన్యాసిరావు, కమల కుమారి కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ప్రవల్లిక జనరల్ నర్సింగ్ పూర్తి చేసి రెండేళ్లు శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేసింది. రెండేళ్ల కిందట ఆమెకు డయేరియా, జ్వరం రావడంతో ఆస్పత్రుల చుట్టూ తిరిగితే నయమైపోయింది. మళ్లీ ఈ ఏడాది మే నుంచి అవే సమస్యలు మొదలయ్యాయి. కానీ ఈ సారి అనారోగ్యం తగ్గలేదు.

విశాఖ, శ్రీకాకుళం, విజయవాడ ఆస్పత్రుల చుట్టూ తిరిగినా అనారోగ్యానికి కారణం తెలియరావడం లేదు. ఇప్పటికే రూ.15 లక్షల వరకు ఖర్చుపెట్టారు. ఉన్నవన్నీ అమ్ముకున్నారు. నెల రోజుల నుంచి ఈ యువతి ఇంటి వద్దనే ఉంటోంది. ఐదు నెలల ముందు ఉన్న రూపానికి ఇప్పుడు ఉన్న రూపానికి అసలు పోలికే లేదు. ప్రతి నెలా వేలాది రూపాయలు మందుల కోసం ఖర్చు చేయాల్సి వస్తోందని, చేతిలో డబ్బులు లేకపోవడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాతలే ఆదుకోవాలని కోరుతున్నారు.


అనారోగ్యం బారిన పడక ముందు..


అనారోగ్యం బారిన పడిన తర్వాత..

#### కూలి చేసి కాపాడుకుంటున్నాం..



మాది రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం. పాపను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నాం. రోజు వారి కూలి పనులు చేసి ఆ డబ్బులతోనే వైద్యం చేయిస్తున్నాం. కానీ మా సంపాదన ఏమూలకూ సరిపోవడం లేదు. పెళ్లీడు కూతురు ఇలా మంచంపై పడి ఉండడం చూడలేకపోతున్నాం. దాతలు, ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి. సాయం చేయాలనుకునే వారు 9121955742, 9989846057 నంబర్లను సంప్రదించాలి.

– కడగాన సన్యాసిరావు, ప్రవల్లిక తండ్రి, సంతవురిటి, జి.సిగడాం మండలం

## ఇళ్ల నిర్మాణాలపై స్పీకర్ సమీక్ష


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

**ఆమదాలవలస:** నిర్ణీత గడువులోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని, దానికి అధికారి యంత్రాంగం సన్నద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి తమ్మినేని సీతారాం ఆదేశించారు. ఆమదాలవలస మున్సిపల్ కార్యాలయంలో ఆమదాలవలస నియోజకవర్గానికి సంబంధించి నాలుగు మండలాలు, మున్సిపాలిటీకి సంబంధించి హౌసింగ్ అధికారులతో మంగళవారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాజుల కొల్లువలస జగనన్న కాలనీ లే అవుట్‌లో సుమారు 1734 ఇళ్ల పట్టాలు మంజూరు చేశామన్నారు. ఇళ్ల నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పొందూరు, బూర్జ, సరుబుజ్జిలిలో వేసిన లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీశారు. కొత్త కొత్త ఊళ్లనే ప్రభుత్వం నిర్మిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు కట్టుకునే లబ్ధిదారులకు కోట్ల రూపాయల్లో బిల్లులు చెల్లించిందన్నారు. అందులో సిమెంటు, ఐరన్ మొదలగు నిర్మాణ సామగ్రికి కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. రాష్ట్రంలో 31 లక్షల ఇళ్ల పట్టాలిచ్చామని, అందులో 8 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తిచేసుకున్నాయని అన్నారు. రెండో విడతగా ఐదు లక్షలు ఇళ్లు జనవరి నెలకు పూర్తి చేయాలని గడువు నిర్ణయించారని ఆయన అన్నారు. ఆమదాలవలసలో వివిధ దశల్లో నిర్మాణాలు కొనసాగుతున్న ఇళ్లన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ గణపతిరావు, హౌసింగ్ అధికారులు డీఈ అప్పారావు, ఏఈలు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలో పోలీసుల కార్డన్ సెర్చ్


వాంబేకాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న ఎస్ఐ గణేష్

**శ్రీకాకుళం క్రైమ్:** జిల్లా కేంద్రంలో మంగళవారం ఉదయం ఆరుగంటల నుంచి ఒకటో పట్టణ పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ రాధిక ఆదేశాల మేరకు సీఐ లెంక సన్యాసినాయుడు ఆధ్వర్యంలో నగరంలోని వాంబేకాలనీ, రాజీవ్ గృహకల్ప నివాస సముదాయాల్లో ఎస్‌హెచ్‌ఓ కామేశ్వరరావు, ఎస్ఐ బలివాడ గణేష్, రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్, 30 మంది వరకు స్టేషన్ సిబ్బంది ఈ సెర్చ్‌లో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి మనుషులను, వారి ఆధార్ కార్డులను పరిశీలించి విచారించడమే కాక అనుమానాస్పదంగా ఉన్న 21 ద్విచక్ర వాహనాలను పరిశీలించి సరైన పత్రాలు లేని 14 ద్విచక్ర వాహనాలను స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నివాస గృహాల వారితో సీఐ మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వారి కదలికలను పసిగడుతుండాలని, రాత్రి వేళల్లో గంజాయి, ఇతర నిషేధిత మత్తుపదార్థాలు తాగి ఎవరైనా అలజడులు సృష్టించినా, అమ్ముతున్నట్లు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వరాదని, తెలిసిన వారైనా మైనరు అమ్మాయిలతో కలిసి వస్తే ఎట్టి పరిస్థితుల్లో ఆశ్రయం ఇవ్వరాదని, ఇచ్చినందుకు మీరూ నేరస్తులవుతారన్నారు. బైక్‌లు బయట వ్యక్తుల వద్ద కొంటే వారి నుంచి సంబంధిత పత్రాలను ట్రాన్స్‌ఫర్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

## జ్యోతిరావు పూలేకు ఘనంగా నివాళి


పూలే చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఇతర అధికారులు

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** దేశంలో మహాత్మా బిరుదు పొందిన మహానుభావులు ఇద్దరేనని, ఒకరు జ్యోతిరావు పూలే కాగా, మరొకరు జాతిపిత గాంధీ అని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అభివర్ణించారు. జ్యోతిరావు పూలే తొలి తరం గొప్ప సంస్కర్త అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే 133వ వర్ధంతి కార్యక్రమం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అట్టడుగు, బలహీన వర్గాల ప్రజల పట్ల సామాజిక స్పృహ కలిగిన వ్యక్తి పూలే అన్నారు. ఆ కాలంలోనే నిరక్ష్యరాసులైన మహిళలకు విద్యను అందించిన విద్యావేత్త అని ప్రశంసించారు. పూలే, అంబేడ్కర్ వంటి మహనీయులు జన్మించిన మహారాష్ట్రలోనే తానూ జన్మించడం అదృష్టమన్నారు. అనంతరం జ్యోతీరావు పూలే పార్కులో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్.గడ్డెమ్మ, బీసీ సంక్షేమాధికారి ఇ.అనురాధ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గుండె సమస్యలపై 108 సిబ్బందికి శిక్షణ


శిక్షణ పొందిన 108 ఈఎంటీలు

**కాశీబుగ్గ:** పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఆవరణలో 108 సిబ్బందికి మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. పలాస రెవెన్యూ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న 108 సిబ్బందికి నూతన పోకడలకు అనుగుణంగా జిల్లా ఈఎంఎస్ మేనేజర్ హరిప్రసాద్, పలాస ఓఈ జగన్ పర్యవేక్షణలో ఓజేటీ నెయ్యిల కృష్ణ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో హఠాత్తుగా గుండె ఆరోగ్య సమస్యలు వచ్చినపుడు వాటి నివారణ చర్యలు, అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తులకు సీపీఆర్ చేసే విధానం, ఈసిజి, ఎసిఎల్ఎస్ ఎయిర్ వే మేనేజ్‌మెంట్, 108 అంబులెన్స్‌లో ఉండే పరికరాలు, మందులు వాటి ఉపయోగాలు వంటి విషయాలపై శిక్షణ, సమీక్ష తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలో పనిచేస్తున్న వారు పాల్గొన్నారు.

## • మౌనికకు అశ్రు నివాళి


కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేషన్ అధికారులు

**శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వీఆర్‌ఓ మౌనిక.. మరణించి కూడా కొందరిని బతికించడం గర్వించదగ్గ విషయమని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ఎంవీ పద్మావతి అన్నారు. మౌనిక మృతిపై కార్పొరేషన్ కమిషనర్ చల్ల ఓబులేసు ఆధ్వర్యంలో మంగళవారం కొవ్వొత్తుల తో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. మౌనిక కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. అవయదానానికి మౌనిక తల్లిదండ్రులు అంగీకారం తెలిపి మరొకరికి ప్రాణాలు నిలబెట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ రంగయ్య, కమిషనర్ చల్ల ఓబులేసు, ఏసీపీ రమణమూర్తి, డీఈ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రభుత్వ సేవలు వినియోగించుకోండి'


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికారులు

**పలాస:** జీడి పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం ఈపీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అధికారులు హితవు పలికారు. పలాస కాష్యూ మ్యానుఫేక్చరర్స్ అసోసియేషన్ హాల్‌లో మంగళవారం సంయుక్త సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఈపీఎఫ్ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎస్.కె అహ్మద్ భాషా, ఈఎస్ఐ జిల్లా మేనేజరు ప్రజ్ఞ పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ డిస్పెన్సరీ ఉందని, త్వరలో 30 పడకల ఆస్పత్రి కూడా వస్తుందని చెప్పారు. అంతేకాకుండా జెమ్స్ ఆస్పత్రితో అనుసంధానం కూడా ఉందని వాటిని ఉపయోగించుకోవాలంటే పరిశ్రమదారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఈఎస్ఐ నిధి చెల్లించాలని, కార్మికుల పేర్లను రికార్డుల్లో నమోదు చేయించాలని కోరారు. అందుకు పరిశ్రమదారులు సహకరించాలని చెప్పారు. అలాగే పీఎఫ్ కూడా క్రమం తప్పకుండా కార్మికుల పేరున చెల్లించి వారి ఆధార్ కార్డును లింక్ చేస్తే సంబంధించిన అన్ని సదుపాయాలు అందుతాయని అహ్మద్ భాషా చెప్పారు. ముఖ్యంగా కార్మికులకు పింఛను సదుపాయం ఉందని, ఈ విషయాన్ని కార్మికులకు కూడా తెలియజేయాలని కోరారు. పలాస కాష్యూ మ్యానుఫేక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లా సురేష్‌కుమార్, పలాస పారిశ్రామిక వాడ జీడి పప్పు ఉత్పత్తుదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా పీఎఫ్ చెల్లిస్తున్నామని, అయితే ఇంతవరకు ఎవరికి కూడా తగిన బెనిఫిట్స్ అందలేదని తదితర సమస్యలు వారి దృష్టికి తీసుకొని వెళ్లారు.

దానికి అధికారులు సమాధానం చెబుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు చెల్లించాలని, వారి ఆధార్ కార్డులకు లింక్ కావాలని అప్పుడు తప్పకుండా వారికి తగిన సదుపాయాలు అందుతాయని అన్నారు. సమావేశంలో కాష్యూ అసోసియేషన్ కార్యవర్గం ప్రతినిధులు కేవీ శివక్రిష్ణ, పట్నాన రవికాంత్, మల్లా సూర్యనారాయణ గుప్త, తంగుడు వీర్రాజు, సిందిరి సతీష్, ఎరుకోల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఎన్నికల సంఘం మార్గదర్శకాలు పాటించాల్సిందే'


ఎన్నికల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సంఘ మార్గదర్శకాలు సెక్టార్ అధికారులు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారుల రెండో విడత శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులదే కీలక పాత్ర అని అన్నారు. ఎన్నికలకు నాలుగు నెలల ముందుగా సెక్టార్ అధికారులను నియమించి వారికి శిక్షణ ఇవ్వాలని ఎన్నికల సంఘ మార్గదర్శకాలు ఉన్నాయన్నారు. రిటర్నింగ్ అధికారులకు ఈ సెక్టార్ అధికారులు అనుసంధానమై ఉంటారని, ఒక్కో రిటర్నింగ్ అధికారి కింద 20 నుంచి 30 సెక్టార్లు ఉంటాయని, ఒకో సెక్టార్ అధికారికి 10 నుంచి 15 పోలింగ్ కేంద్రాల పరిధి ఉంటుందని చెప్పారు. సెక్టార్ అధికారులకు ఎన్నికల సమయంలో మెజిస్టీరియల్ అధికారాలు ఇస్తామని, సెక్టార్ అధికారులు తమ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్నీ స్వయంగా సందర్శించి వసతులను, ఓటర్లకు అనుకూలతలను పరిశీలించాలని, సమస్యాత్మక అంశాలను నమోదు చేసుకోవాలని వివరించారు. తమ పరిధిలో సోషల్, కమ్యూనిటీ, పొలిటికల్, లా అండ్ ఆర్డర్ పరిస్థితులు ఎలా ఉన్నాయో పర్యవేక్షించాలని సూచించారు. బూత్ లెవల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎస్‌హెచ్‌ఓలను ఒకరికి ఒకరు పరిచయం చేసుకోవాలని, గ్రామాల్లో రాజకీయ పక్షాలతో సమావేశాలు నిర్వహించి సమస్యలపై చర్చించాలన్నారు. ఎన్నికలకు ఎలక్టోరల్, ఈవీఎం, పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ సిబ్బంది కీలకమని కలెక్టర్ అన్నారు. ప్రతి ఎన్నికలనూ కొత్తగానే చూడాలని, ఏ దశలోనూ తప్పిదాలకు ఆస్కారం ఇవ్వకూడదని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియ, ఈవీఎంల నిర్వహణపై సెక్టార్ అధికారులకు అవగాహన కల్పించారు. ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణ ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని కలెక్టర్ కోరారు. మాస్టర్ ట్రైనీ జయదేవి ఎన్నికల నిర్వహణ అంశాలపై పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా వివరించారు. సెక్టార్ అధికారుల అనుమానాలు నివృత్తి చేసి, అనంతరం ఈవీఎంల ద్వారా ఓటింగ్ విధానాన్ని వివరించారు. శిక్షణ కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జిల్లా పరిషత్ సీఈఓ వెంకట్ రామన్, శ్రీ కాకుళం ఆర్డీవో సీహెచ్ రంగయ్య, పలాస ఆర్డీవో భరత్ నాయక్, ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాలకు ఎన్నికల విధుల కోసం నియమితులైన సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులు హాజరయ్యారు.

## పదోన్నతులు కల్పించాలని డిమాండ్


పదోన్నతులు కల్పించాలని ఎస్‌ఈకి వినతి పత్రం అందిస్తున్న ఇంజినీర్లు

**శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):** ప్రభుత్వం ఉత్తరాంధ్ర ఇంజినీర్లపై చొరవ చూపి పదోన్నతులు కల్పించాలని ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జి.రామచంద్రరావు కోరారు. టీడీపీ హయాంలో తమకు అన్యాయం జరిగిందని, దీనిపై కోర్టుకు వెళ్లి పోరాడామని, కోర్టు తమకు అనుకూలంగా తీర్పునిచ్చినా ప్రమోషన్లు రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వీరంతా బీఆర్ఆర్ వంశధార కార్యాలయంలో మంగళవారం నల్లరిబ్బన్లు కట్టుకుని విధులను బహిష్కరించి కార్యాలయానికి తాళాలు వేశారు. ప్రభుత్వానికి తమ గోడు వినిపించాలని కోరుతూ వంశధార ఎస్‌ఈ డోల తిరుమలరావుకి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ న్యాయబద్ధంగా పదోన్నతులు కల్పించకపోవడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా 400 మంది ఇంజినీర్లు పదోన్నతులు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఇంజినీర్ల సంఘం ఉపాధ్యక్షుడు త్రినాథరావు, ఈఈ ఎం. వెంకటరమణ, కేవీఐ స్వర్ణకుమార్, డీఈ ఎం.మురళీమోహన్, ఈఈలు, డీఈలు, జేఈలు తదితరులు పాల్గొన్నారు.

## ఎనిమిది మందిపై కొట్లాట కేసు నమోదు

**ఎచ్చెర్ల క్యాంపస్:** కుశాలపురం పంచాయతీ నవభారత్ సమీపంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న దాబాలో ఫరీదుపేటకు చెందిన కొందరు సోమవారం రాత్రి పాత కక్షలు నేపథ్యంలో కొట్లాటకు దిగారు. ముందుగా వాగ్వాదం జరగ్గా, అనంతరం కొట్లాట జరిగింది. ఇరు వర్గాల నుంచి ఫిర్యాదులు స్వీకరించినట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. ఒక వర్గానికి చెందిన పైడి జగదీష్‌తో పాటు మరో ముగ్గురు, మరో వర్గానికి చెందిన కూన శ్రీనివాసరావుతో పాటు మరో ముగ్గురుపై కొట్లాట కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

**శ్రీకాకుళం న్యూకాలనీ:** శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్)కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు.. ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జనిత్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత శాస్త్రీ పుల్లెల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డిగ్రీతోపాటు నైతిక విలువలను, సమాజంలో బతకడానికి కావలసిన నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని ఆయన సూచించారు.

కళాశాలకు కొన్ని కంప్యూటర్లను ఉచితంగా అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కళాశాల స్టూడెంట్ వెల్ఫేర్ యూనియన్ కో ఆర్డినేటర్, బయోటెక్నాలజీ విభాగ అధిపతి ఎం.ప్రదీప్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ రోణంకి హరిత, వైస్‌ప్రిన్సిపాల్ ఎంవీ సత్యనారాయణ, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ పోలినాయుడు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వరల్డ్ స్కిల్ కాంపిటీషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**ఎచ్చెర్ల క్యాంపస్:**

వరల్డ్ స్కిల్ కాంపిటీషన్‌లో పాల్గొనేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి పీబీ సాయిశ్రీనివాస్ తెలిపారు. ఎచ్చెర్ల స్కిల్ కాలేజ్‌లో మంగళవారం వివరాలు వెల్లడించారు. ఈ పోటీల్లో 40 నైపుణ్య విభాగాలకు దరఖాస్తులు చేసుకోవచ్చునని అన్నారు. ఈ నెల 30 లోపు దరఖాస్తు చే యాలన్నారు. వరల్డ్ స్కిల్ కాంపిటీషన్-2024 ఫ్రాన్స్‌లోని లియోన్‌లో జరుగుతుందని తెలిపారు. దరఖాస్తుదారుల్లో నైపుణ్యాలను వివిధ దశల్లో పరీక్షించి అర్హులను పోటీలకు దేశం తరపున పంపిస్తామన్నారు. అడిటివ్ మాన్యుఫాక్చరింగ్, క్లౌడ్ కంప్యూటరింగ్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ కన్‌స్ట్రక్షన్, మెకట్రానిక్స్, రోబోట్ ఇంటిగ్రేషన్ విభాగాల్లో పాల్గొనేవారు 1999 జనవరి 1వ తేదీ లోపు జన్మించి ఉండాలని తెలిపారు. మిగతా విభాగాల్లో పోటీ పడేవారు 2002 జనవరి 1వ తేదీలోపు జన్మించి ఉండాలని చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు హెచ్‌టీటీ:స్కిల్ యూనివర్స్.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వరల్డ్ స్కిల్ రిజిస్ట్రేషన్ వెబ్ లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.